## క్లుప్తంగా

### విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయండి


టెక్కలిలో ప్రచారం చేస్తున్న నాయకులు

**టెక్కలి:** ఈ నెల 12న టెక్కలిలో నిర్వహించనున్న బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ టెక్కలి మండల కన్వీనర్ హెచ్.వెంకటేశ్వ్రరావు, పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్, పి.రమణబాబు, కె.అజయ్, నర్సింగ్ నాథ్ సాబతో, బి.రాజేష్, కోటబొమ్మాళి మండలంలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, పార్టీ మండల కన్వీనర్ ఎస్.హేమసుందర్‌రాజు, నాయకులు పేడాడ వెంకట్రావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### విస్తృతస్థాయి సమావేశానికి తరలిరండి

**నందిగాం:** టెక్కలిలోని ఆదిత్య కళ్యాణ మండపంలో ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అధ్యక్షతన జరగనున్న బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీపై నిర్వహించనున్న విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. ఈ మేరకు మండలంలోని సైలాడ, రౌతుపురం గ్రామాల్లో బుధవారం పర్యటించి ఆయా గ్రామాలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చెప్పిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తు చేస్తూ రీకాలింగ్ చంద్రబాబుస్ మ్యానిఫెస్టోపై నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్సీ బొత్స సత్యన్నారాయణ, పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం పాల్గొంటారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, యువజన అధ్యక్షులు చిన్ని జోగారావు, జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, శంబాన దానయ్య, బెండి ఫాల్గుణరావు, గున్న మధు, అమ్మారావు ఉన్నారు.

### పూర్వ విద్యార్థుల ఔదార్యం

**కంచిలి:** పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులు ఔదర్యాన్ని చాటుకున్నారు. పాఠశాల నిర్వహణకు అవసరమైన పలు వస్తువులను వితరణ చేశారు. గళ్యా వంశీ, వంకల గంగారావు, గళ్యా తారకేశ్వరరావు, ఎర్ర తేజేశ్వరరావు, వంకల శివాజీలు రూ. 12 వేలు విలువైన కలర్ ప్రింటర్‌ను, బొండాడ కిరణ్, వాసు, నారాయణ, శశి, వంకల హరీష్, శర్మ, సందీప్, గోపాల్‌లు రూ. 13,800 విలువైన మైక్, సౌండ్ సిస్టమ్‌ను సమకూర్చారు. వీటిని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ చేతులమీదుగా హెచ్‌ఎం ఎస్.శారదకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఈ ఏడాది 45 మంది విద్యార్థులు చేరడం గొప్ప విషయమన్నారు. ఉపాధ్యాయుడు నల్లాన రవి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**పలాస:** విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం పలాస తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. జీవో నంబర్ 77ను రద్దు చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, తల్లికి వందనం పథకాన్ని షరతులు లేకుండా అందజేయాలని కోరారు. తహసీల్దార్ కళ్యాణచక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌ఏయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.రవి, హరిక్రిష్ణ, సోమేశు, రాహుల్ పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

**ఇచ్ఛాపురం రూరల్:** లొద్దపుట్టి పంచాయతీ జగన్నాథపురంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులచే బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 85 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మంధాకిని, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు ఆశి పురుషోత్తం ప్రారంభించారు.

### పోలీసులను పక్కన పెట్టి రండి తేల్చుకుందాం



పోలీసులను పక్కన పెట్టి తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులతో పెట్టుకుంటే ఎవరు ఏమిటో తేల్చుకోవచ్చు. తమ పార్టీకి చెందిన గ్రామీణ కార్యకర్త నుంచి సోషల్ మీడియా సభ్యులు, వివిధ స్థాయి నాయకుల వరకు కేసులు పెట్టడం, దాడులుచేసి బెదిరించి ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. 50 ఏళ్లకే పింఛన్, ప్రతి మహిళకు నెలకు రూ. 15 వందలు అంటూ ఆశచూపి ఓట్లు వేయించుకున్నారు. ఏడాది పాలనలో పథకాలు ఇవ్వలేక చేతులెత్తేయడంతో తీవ్రమైన వ్యతిరేకతను కూటమి నాయకులు మూటకట్టుకున్నారరు. 2029లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయం.

ధర్మాన కృష్ణదాస్,
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు

### జగన్ 2.0లో కార్యకర్తలే రారాజు



జగన్ 2.0లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే రారాజులు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు మీ ఇంటికి వచ్చే పథకాలు అంటూ బాండ్‌ల రూపంలో ఇచ్చారు. ఇప్పుడు వాటిని నేరవేర్చకుండా మాయమాటలు చెబుతున్నారు. దీనిపై ప్రతీ కార్యకర్త టీడీపీ నాయకులను నిలదీయాలి. మేనిఫెస్టో గురించి అడిగితే తొక్కతీస్తానని బాబు, తోలుతీస్తానని పవన్ అంటున్నారు. పేదవాడికి ప్రధాన శత్రువు చంద్రబాబే. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదలు, నిరుపేదలు, బడుగు బలహీనవర్గాల వారు, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారు ఎంతో ఆసరా పొందారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఒక్క పథకం ఇవ్వలేకపోయారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఇప్పుడు జిల్లాలోనే ప్రయాణించాలని ఆంక్షలు పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రభుత్వ పథకాలు ఇస్తే నాగుపాముకు పాలు పోసి నట్లే. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే 70 శాతం ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని వచ్చింది. వచ్చే ఎన్నికల నాటికి అన్ని సీట్లు పోవడం ఖాయం.

– కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ, పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు

క్యూఆర్‌కోడ్ ఆవిష్కరణలో ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, కుంభా రవిబాబు, సీదిరి అప్పలరాజు, నర్తు రామారావు, దుంపల లక్ష్మణరావు తదితరులు



# కూటమి సర్కార్‌పై ప్రజా వ్యతిరేకత

● పలాస వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో నేతల వెల్లడి


విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన ముఖ్యనాయకులు

**కాశీబుగ్గ:** ఏడాది పాలనలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు అన్నారు. పలాసలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'పై బుధవారం జరిగిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. పార్టీలోని వివిధ విభాగాలకు నియమితులైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఆమదాలవలస ఇన్‌చార్జి చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ కాళింగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, ముఖ్యనాయకులు హనుమంతు వెంకటరావుదొర, పానిల శ్రీనివాసరావు, డొక్కరి దానయ్య, ఉంగ సాయి క్రిష్ణ, బోర కృష్ణారావు, శిష్టు గోపి, సవర చంద్రమ్మ, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, బమ్మిడి దుర్యోధనరావు, బడగల బలయ్య, బోర చంద్రకళ, బత్తిని హేమేశ్వరరావు, పైల వెంకటరావు, దల్లి జానకీరావు, దువ్వాడ మధు, శంకర్ పండా, బమ్మిడి సంతోష్, సుజాత పండా, మద్దిల హరినారాయణ, దున్న హరిక్రిష్ణ, అగ్గున సూర్యారావు, మామిడి నరసింహామూర్తి పాల్గొన్నారు.


దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

### పలాసలో లోకల్ టాక్స్ వసూలు



పలాసలో లోకల్ టాక్స్‌ను వసూలు చేస్తున్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా మహిళ ఉండి ప్రతి మద్యం బాటిల్‌పై అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. నెలకు కోటి రూపాయల వరకు మద్యంపై అదనంగా వసూలు చేస్తూ ఏడాదికి రూ.12 కోట్లు పోగేసుకుంటున్నారు. పలాసలోని సూదికొండను బోడికొండగా మార్చేశారు. పచ్చని ఉద్దానంలో ఎయిర్‌పోర్టు కట్టేస్తామంటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో 1850 ఎకరాల కేంద్ర ప్రభుత్వ బంజర భూములు ఉన్నాయని చెబుతుంటే వాటిని పట్టించుకోకుండా ఉద్దానంలో జీడితోటలను తీసుకుంటామంటున్నారు. ఆర్డీవో వెళ్లి అరువు మనుషులతో ఎయిర్‌పోర్టు కోసం సమావేశం పెడుతున్నారు. గతంలో కుటుంబ పాలనతో విసిగివేసారి చాలామంది నక్సలైట్ యుద్ధంలో పాల్గొన్నారు. తిరిగి అదే బాటలో ప్రజలు పయనించే పరిస్థితి తీసుకొస్తున్నారు. మందస మండలంలో 60 ఏళ్లుగా అనుభవిస్తున్న గిరిజన రైతుల వద్ద భూములను లాగేసుకోవాలని చూస్తున్నారు. పలాసలో జీడి పరిశ్రమలపై జీఎస్టీ అధికారులు దాడులకు పాల్పడుతున్నారు. ఏఎంసీ వారు కూడా ఇబ్బందులు పెడుతున్నారు. జీడి కార్మికులకు వేతనాలు పెంచకుండా ఇబ్బందులు పెడుతున్నారు. అన్నివర్గాల వారిని టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. – **డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి, పార్టీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు**

### మద్యం డోర్ డెలివరీ



టీడీపీ నాయకులు శ్రీకాకుళం జిల్లాకు చెప్పుకోదగిన పథకం ఏదైనా తీసుకువచ్చినా, చెప్పుకోదగిన నిర్మాణాలు చెపట్టినా వెల్లడించాలి. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 15 మెడికల్ కళాశాలలు తీసుకువస్తే అందులో ఐదు పని చేస్తున్నాయి.. మిగిలినవి ప్రైవేటు యాజమాన్యాలకు ప్రస్తుత ముఖ్యమంత్రి అమ్మకానికి పెడుతున్నారు. చెప్పిన మాట వినే పోలీసు అధికారులను ఉంచి.. మిగిలిన పోలీసు (ఐపీఎస్) అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. మద్యం అమ్మకాలు ఏస్థాయిలో ఉన్నాయంటే టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. మద్యం దుకాణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు నేరుగా చేరుతున్నాయి. చివరకు డోర్ డెలివరీ అయ్యే పరిస్థితులు వచ్చాయి. గ్రానైట్ వ్యాపారంలో టీడీపీ నాయకులు క్యాష్ చేసుకుంటున్నారు. పేదవాడు గూబ పగలగొట్టే పరిస్థితి వచ్చింది. కళ్లు ఉండి చూడలేని.. చెవులు ఉండి వినే పరిస్థితి కూటమి ప్రభుత్వానికి లేదు.

**తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్, పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ ఇన్‌చార్జి**



# సీజీఆర్‌ఎఫ్‌తో విద్యుత్ సమస్యలు పరిష్కారం

● చైర్మన్ సత్యన్నారాయణ వెల్లడి


వినతులు స్వీకరిస్తున్న చైర్మన్ సత్యన్నారాయణ

**టెక్కలి:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీజీఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని చైర్మన్ బి.సత్యన్నారాయణ అన్నారు. బుధవారం టెక్కలిలోని ఎస్-కన్వెన్షన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి 23 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా ఓల్టేజీ సమస్యలతో పాటు స్మార్ట్ మీటర్ల వలన కలుగుతున్న ఇబ్బందులపై వినియోగదారులు ఏకరువు పెట్టారు. లభిదాసుపురం హైస్కూల్‌కు విద్యుత్ స్తంభాలు వేయాలని, గ్రామంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని, కొత్తమ్మతల్లి వీధిలో విద్యుత్ లైన్లపై జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఏబీ స్విచ్‌ను సరిచేయాలని, రేవతిపతి వీధి, అయ్యప్ప నగర్, సైనిక్‌నగర్‌లో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని వినియోగదారులు కోరారు. లాగే కోట ఎనర్జీ బంక్‌కు స్మార్ట్ మీటర్ ఏర్పాటుతో అత్యధికంగా బిల్లులు వస్తున్నాయని, శ్రీనివాసానగర్‌లో తనకు చెందిన సొంత స్థలంలో అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని, ఇదే వీధిలో ఇళ్లకు ఆనుకుని ఉన్న లైన్లు సరిచేయాలని, శ్రీరామా కాలనీలో తనకు చెందిన మూడు ఇళ్లల్లో ఎటువంటి విద్యుత్ వినియోగించకపోయినప్పటికీ.. అధికంగా సర్‌చార్జీలు వసూళ్లు చేస్తున్నారని తదితర సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు చేశారు. అనంతరం చైర్మన్ సత్యన్నారాయణ మాట్లాడుతూ.. సీజీఆర్‌ఎఫ్ వేదికగా ఇప్పటి వరకు 8,775 విద్యుత్ సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేసిన తరువాత 60 రోజుల్లో పరిష్కారం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతీ వినియోగదారుడు సమస్యల పరిష్కారం కోసం 9440014734 వాట్సాప్ నంబర్‌తో పాటు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సత్యన్నారాయణ వెల్లడించారు. ముందుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు ఎస్.సుబ్బారావు, ఎస్.రాజబాబు, ఎస్.మురళీకృష్ణ, టెక్కలి డీఈఈ జి.శంకరరావు, ఏడీలు, ఏఈలు, వినియోగదారుల ఫోరం ప్రతినిధి కె.కిషోర్ పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

**మందస:** మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. దీనికి కోసం సిబ్బంది కృషి చేయాలని సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (ఎస్‌ఈఆర్‌పీ) పరిధిలో పంచ సూత్రాల ప్రకారం పనిచేస్తున్న స్వయంశక్తి సంఘాలన్నింటినీ నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) ద్వారా జీవనోపాధి కల్పించి ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలన్నారు. సిబ్బంది తారక్‌మోహన్, కళ్యాణి, ముఖలింగం, స్వామి నాయుడు, మంగమ్మ పాల్గొన్నారు.

### లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

**పలాస:** లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని టెక్కలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మేరీ కేథరిన్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మల్టీ లెవల్ అప్రూవేటెడ్ కమిటీ సమావేశం ఆర్డీవో జి.వెంకటేశ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం స్కానింగ్ సెంటర్లను నడపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తలిస్తే సంబంధిత కేంద్రాలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పలాస గైనకాలిజిస్టు డాక్టర్ నాగసుశీల, అడ్మినిస్ట్రేటివ్ అధికారి బి.ప్రకాశరావు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు బి.గోపాల్, డిప్యూటీ హెచ్‌ఈవో విజయలక్ష్మి, లీగల్ అడ్వయిజర్ జగదీష్ పాల్గొన్నారు.

### దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

**సోంపేట:** బారువ మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న విద్యాసంస్థల సమీపంలోని పాన్‌షాపులు, దుకాణాల్లో బారువ ఎస్సై ఎస్.హరిబాబు నాయుడు సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో సిగరెట్లు, మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


టెక్కలిలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు


ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల ర్యాలీ


మందస: నిరసన ప్రదర్శనలో కార్మికులు

# ● రోడ్డెక్కిన కార్మికలోకం

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కార్మికులు నినదించారు. కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని గళమెత్తారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ధర్నా చేసి కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు కోడ్‌లు రద్దు చేయాలని, మతోన్మాదం నశించాలని, కార్మిక ఐక్యత వర్ధిల్లాలని, ఎనిమిది గంటల పని విధానం సక్రమంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజన పథకం వర్కర్లు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. –సాక్షి నెట్‌వర్క్


వజ్రపుకొత్తూరు రూరల్: ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు